# సింధునాదం

'డియర్ శ్యాం!

చనిపోయేముందు నీకు ఉత్తరం రాయాలనిపించింది.' మొదటి వాక్యం చదవగానే అతని చేతులు వణికాయి. ఆతృతగా మిగతా ఉత్తరం చదవసాగాడు.

'ఎందుకో తెల్సా ..... పోస్టు గ్రాడ్యుయేషన్‌లో రెండేళ్ళు అతి సన్నిహితంగా కల్సి తిరిగాం కాబట్టి. నా జీవితంలో మధుర క్షణాలు ఏవైనా ఉన్నాయి అంటే ఆ రెండేళ్ళే!

ప్రస్తుతానికొస్తే నాకు, ఆమాటకొస్తే, నాలాంటి వారికి భవిష్యత్తు అంటూ ఏం లేదని తెల్సుకున్నాను. కాకిలా కలకాలం బతికే కంటే కలలాంటి జీవితాన్ని ముగిద్దామనిపించింది. ఎన్నేళ్ళు బ్రతికినా జీవితం యింతేకదా? ప్రొద్దున్నే లేచి లైబ్రరీకెళ్ళి వాంటెడ్ కాలమ్స్ చూడటం... అప్లై చెయ్యడం... కరువులో అధికమాసంలా ఈ అప్లికేషన్లు పంపడానికి నాకు చాలా డబ్బు ఖర్చయిపోయింది. ఆ పైన వ్రాత పరీక్షలు.. యింటర్వ్యూలు ఉండనేవున్నాయి. ఒకవేళ చివరికి ఇంటర్వ్యూ బాగా చేసి సెలక్ట్ అవుదామని ఆనందపడే ఘడియలో నా దురదృష్టం నాకంటి ముందు పోయి నాకు రావలసిన ఉద్యోగాన్ని గ్రద్దలా నాకంటే ముందు తన్నుకుపోతూవుండేది.

అందుకే ఈ పరుగు పందేల ప్రపంచంలో నే బతకలేను. మొండి జీవితాన్ని ఇంక లాగదల్చుకోలేదు.

అందుకే ఈ రాత్రికి స్లీపింగ్ పిల్సు వేసుకుంటున్నా! ఈ సాయంత్రం ఈ ఉత్తరం పోస్టు చేస్తున్నా! ఇది నీకు ఎల్లుండి చేరుతుంది. నా అంత్యక్రియలు రేపు జరుగుతాయి. అందుకే ఇది చేరంగానే పరుగెత్తుకుంటూ వచ్చినా ఉపయోగంలేదు. సెలవు దొరికితే పదోరోజురా ఏకంగా!

నీ భావిజీవితానికి నా శుభాకాంక్షలు. నీ మిత్రుడు గోపీనాథ్!'

కళ్ళు మసక బారాయి తడితో.

హృదయం భారమైంది.

శ్యాం! శ్యాం! పిజి చేసేప్పుడు నాకు దొరికిన ఫ్రండ్సులో అత్యంత ఆప్తుడు.

నేను చేస్తున్న ఉద్యోగానికి కారణభూతుడు.

నేను అనుభవిస్తున్నది అతని త్యాగఫలమే!

గతస్మృతులు ఈగల్లా రోదపెడుతున్నాయి.

ఆ ప్రైవేట్ కంపెనీలోని అసిస్టెంట్ మేనేజరు పోస్టుకు పెట్టిన రాత పరీక్షలో చాలా కొద్దిమందే పాసయ్యారు. వారిలో నేను శ్యాం కూడా వున్నాము.

ఇంటర్వ్యూకూడ బాగా చేశాం.

ఆ కమిటీ భైరవయ్య బాగా స్ట్రిక్టు అని తెలుసుకున్నాం. అయినా దొంక దోవలో ప్రయత్నించడంలో తప్పులేదని నాకు కాబోయే మామతో చెప్పాను విషయం.

ఆయన పొలిటికల్ ఇన్‌ఫ్లుయన్స్ పట్టుకుని భైరవయ్యని కలిశాడు. అప్పటికింకా రిజల్ట్సు డిక్లేర్ చెయ్యలేదు.

"చూడండి. మీ శ్యాంపేరు వెయిటింగ్‌లిస్టులో వుంది. మెరిట్‌లో రెండవవాడు- కాబట్టి నేనేం చెయ్యలేను. రేపు అనౌన్స్ చేస్తాం... దయచేసి వెళ్ళండి." భైరవయ్య రాజకీయవ్యక్తికి విలువ యిస్తూ ఉన్న సంగతి చెప్పాడు.

"పోనీ మొదటివాడు ఎవరో చెబుతారా?" మామ అడిగాడు.

"చెప్పకూడదు. అయినా రేపెలాగూ ప్రకటిస్తున్నాం కాబట్టి చెబుతున్నాను. గోపీనాథ్!"

ఇంటికొచ్చి ఆ పేరు చెప్పేసరికి నాకు నిద్ర పట్టలేదు. మిత్రుడికి ఉద్యోగం వచ్చిందన్న ఆనందం. నాకు రాలేదన్న దిగులు. తొందరలో యింకో ఖాళీ ఏర్పడుతుందాని కనుక్కుంటే ఆ అవకాశం లేదని చెప్పారు.

ఆ సాయంత్రం గోపీనాథ్ గంతులు వేసుకుంటూ నా దగ్గరికి వచ్చాడు. "గురూ! నాకు సెలక్షన్ వచ్చింది. సే కంగ్రాట్స్ టుమి! నీకు కంగ్రాట్స్! నీ పేరు వెయిటింగ్ లిస్టులో వుంది." అతని ఆనందం చూస్తే నాకు ఆనందం కలిగింది. గోపీనాథ్ చాలా బీదవాడు... అష్టకష్టాలుపడి చదువుకున్నాడు. అట్లాగని బ్రిలియంట్ కాదు... ఏవరేజ్ కంటే రెండు మెట్లు ఎక్కువ.

"కంగ్రాట్స్ అండ్ థ్యాంక్స్!" చెప్పాను ముభావంగా.

"అరే! నాకు ఉద్యోగం వచ్చిందంటే... నాకంటే ఎక్కువ నువ్వు సంతోషిస్తావని ముందు నీ దగ్గరికే వచ్చాను." ఆశ్చర్యంగా అన్నాడు.

"నిజమే.... కానీ, నా మూడ్ బాగోలేదు.. ఎందుకంటే.. నాకు కావల్సిన పెళ్ళి వాయిదా పడబోతున్నది." బాధగా చెప్పాను.

"వ్వాట్! ఎందుకు?"

"ఏముంది నిరుద్యోగికి యివ్వడానికి మా మామకు యిష్టంలేదు, ఆ అమ్మాయికీ యిష్టం లేదు."

"అరే! వట్టి పిచ్చివాళ్ళు లాగున్నారు. ఇవ్వాళ కాకపోతే రేపు రాదా ఉద్యోగం... లోకం గొడ్డు పోయిందా? దానికోసం పెళ్ళి వాయిదా వెయ్యాలా! సిల్లీ!" బాధపడ్తూ అన్నాడు.

"ఏమో! వాళ్ళకు నా మీద నమ్మకం లేదు."

"పోనీ నన్ను నచ్చచెప్పమంటావా?"

"అక్కరలేదు. నాకుద్యోగం వస్తే ఎవరూ చెప్పనక్కరలేదు." కరుకుగా అని లోపలికిపోయి పడుకున్నాను.

ఓ వారం తర్వాత నాకు ఆ కంపెనీ నుండి అపాయిట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. ఆశ్చర్యపోతూ జాయిన్ అయ్యాను. తర్వాత తెల్సింది. గోపీనాథ్ తనకు ఆ ఉద్యోగం యిష్టంలేదని రాసి యిచ్చాడని. విషం మింగిన శంకరుడిలా ఆ ఉద్యోగంలో చేరిపోయాను.

నా పెళ్ళిలో అడిగాను వాడ్ని.

"ఏరా! ఎందుకింత త్యాగం చేశావు. నీకు ఉద్యోగం లేదు. నాకు కాస్తో కూస్తో ఆస్తి వుంది. నీకు అదీ లేదు. నువ్వు ఉద్యోగంలో చేరితే ఎంతో బాగుండేది."

వేదాంతిలా నవ్వాడు.

"చూస్తూ చూస్తూ ఓ పెళ్ళి చెడగొట్టబుద్ధికాలేదు. రెండేళ్ళు కల్సి చదువుకున్నాం. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకున్నాం. అటువంటిది ఒకే ఉద్యోగం కోసం పోటీ పడటం మంచిది కాదనిపించింది. అందుకే వద్దని రాసిచ్చాను." చాలా మామూలుగా చెపుతూంటే నా కళ్ళు వర్షించాయి.

పెళ్ళయింతర్వాత - నాకు వేరే ఊరు ట్రాన్స్‌ఫరయింది. బరువు బాధ్యతలు పెరిగాయి. స్నేహంలోని మాధుర్యం గురించి ఆలోచించే సమయం దొరికేది కాదు.

పెద్దగా వాడి గురించి వార్తలేం లేవు. నాలుగేళ్ళు గడిచిపోయాయి. ఇదిగో యిప్పుడే ఉత్తరం!

మనసు నిలవక ఆఫీసుకు సెలవు పెట్టి బయలుదేరాను. కనీసం వాడు పీల్చిన గాలిని పీలుద్దామని... ఆ వాతావరణం చూద్దామని ప్రయాణం కట్టాను.

అతని అడ్రస్సు కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు. పక్కయింటి వాళ్ళను అడిగాను ఏమీ తెలీనట్టు గోపీనాథ్ ఉన్నాడాని! వాళ్ళు విచిత్రంగా నావంక చూశారు."

"గోపీ! హాస్పటల్‌లో ఉన్నాడు."

నాకు ప్రాణం లేచివచ్చింది. కనీసం కడసారి చూపులన్నా దక్కాయని.

హాస్పిటల్‌లో అతనున్న బెడ్‌ను కనుక్కొని వెళ్ళాను. ఓ బెడ్‌మీద ఓ బక్కచిక్కిన ఎముకలగూడు.... ముక్కులో రబ్బరు గొట్టం! వాడు గోపీనాథ్!

అతని దగ్గర పోయి నిలబడ్డాను.

"గోపీ! గోపీ! గోపీ!" అని మృదువుగా అతని చెవి దగ్గర పిలిచాను. కాసేపటికి అతి ప్రయత్నం మీద కనురెప్పలు తెరిచాడు. చూపుచుట్టూ తిరిగి నన్ను చుట్టేసింది.

ఆ కళ్ళల్లో వెలుగు!

తగ్గుతుందన్నట్టు సైగ చేశాను.

ఓ శుష్కమందహాసం చేశాడు.

బలహీనంగా ఓ చెయ్యి ఎత్తి ఓ వైపు చూపించాడు. అటు చూశాను. గోపీ తల్లిదండ్రులు! ఓ గోడ నానుకొని ఏడుస్తున్నారు. నాకు వాడి భావం అర్థమైంది. వాళ్ళని ఓదార్చమని వాడి ఉద్దేశ్యం!

గోపీ తల్లిదండ్రులు రామయ్య, సీతమ్మలు. నాకు బాగానే పరిచయం. నన్ను చూసి ఏడుపు ఆపి లేచి కూర్చున్నారు. బాగా బీదతనంలో మగ్గిపోయినట్టున్నారు. చిరిగిన బట్టలుతో లేచి నిల్చున్నారు.

"శ్యాం బాబూ! డాక్టర్లతో చెప్పి నువ్వన్నా బతికించు." రామయ్య చేతులు పట్టుకున్నాడు.

"దేవుడిలా వచ్చావు బాబూ! నువ్వే దిక్కు!" సీతమ్మ రోదన.

ఇంకేం మాట్లాడకుండా డాక్టరు దగ్గరికి వెళ్ళాను. నన్ను నేను పరిచయం చేసుకొని గోపీ గురించి అడిగాను.

"వెరీ వెరీ బ్యాడ్‌కేసు! లాస్ట్ మినిట్‌లో తెస్తారు. బ్రతికించమని మమ్మల్ని అడుగుతారు. మేమేం దేవుళ్ళమా?.. లేక మ్యాజిక్ చేసి బతికించగలమా?" విసుక్కున్నాడు డాక్టర్ శాంతకుమార్.

"ఇప్పుడెలా వుంది డాక్టర్!"

"ఏం చెప్పను?"

"ప్లీజ్! దాచద్దు."

"అయిపోయింది... నిమిషాల్లో పోవచ్చు లేక గంటల్లో!" పెదవి చప్పరించేశాడు డాక్టర్ శాంతకుమార్!

"నో! గోపీ బతకాలి. ఎంత డబ్బయినా నే భరిస్తా!" ఆవేశంగా ఆయన చేతులు పట్టుకుని అరిచాను.

ఆయన శుష్కమందహాసం చేశాడు.

"డబ్బే మనుషుల్ని బ్రతికించేట్టయితే.... ఈ లోకంలో ధనవంతులెవరూ చావరు."

నా తెలివి తక్కువతనం నాకు అర్ధమయింది.

"డాక్టర్! పోనీ - హైద్రాబాద్ కాని నెల్లూరు కాని తీసుకుపోతే బతుకుతాడా? అఫ్‌కోర్సు మీరు బాగానే ట్రీట్ చేస్తున్నారు. కానీ, అక్కడ ఎడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వుంటుందిగా!" అపాలజెటిక్‌గా అన్నాను.

డాక్టర్ శాంతకుమార్ అశాంతంగా నవ్వాడు.

"మీకు డబ్బెక్కువైతే నాకేం అభ్యంతరం లేదు. అతని అంతిమ ఘడియలు కాస్త ప్రశాంతంగా గడిచిపోతాయనుకున్నాను. ఇట్సాల్‌రైట్... మీక్కావలసిన చోటుకు తీసుకుపోండి... కానీ, అన్నిటికి తయారయిపోండి.. అంటే... మళ్ళీ శవాన్ని ఎలా తేవాలి–"

నాకు కోపం వచ్చి వచ్చేశాను. హైద్రాబాద్‌కు తీసుకుపోవాలి. టాక్సీ మాట్లాడి తెస్తానని వాళ్ళవాళ్ళతో చెప్పి బయటకొచ్చాను. టాక్సీని వెతుకుతూంటే నా ముందు కారొచ్చి ఆగింది.

"హలో! శ్యాం! బాగున్నావా?" టాక్సీ డ్రైవర్ పలకరించాడు.

ఆశ్చర్యపోతూ అతన్ని చూశాను. గుర్తు రావడం లేదు.

"నేను జగన్నాధంను." అతను కన్నుకొట్టాడు.

గుర్తుకొచ్చింది... అతను కూడ మాతో పిజీ చేశాడు. సబ్జెక్టు హిస్టరీ కావును. కానీ, కానీ, ఇదేంటీ టాక్సీతోలడం!

"కమాన్... లోపలకూర్చో!" డోర్ తెరిచాడు. అతని పక్కన కూర్చున్నా!

"ఎందుకొచ్చావ్ యిక్కడికి?"

"గోపీ.... చావు బతుకుల్లో ఉన్నాడు." అంటూ అతని గురించి చెప్పాను.

"నువు సాయం చేస్తే వాడ్ని హైద్రాబాద్‌కు తీసుకుపోదాం!"

జగన్నాధం నవ్వాడు!

నేను కోపంగా చూశాను.

"ఈ టాక్సీ కుదుపులకి తట్టుకుని వాడి ప్రాణం ఏడు గంటలు ఉంటుందనుకుంటున్నావా? పోనీ ఉన్నా... అక్కడమటుకు అంత తొందరగా అటెండయి అతనికి ప్రాణదానం చేస్తారనుకుంటున్నావా?"

"అయితే వాడ్ని అలా వదిలేసి వాడి చావు వాడ్ని చావనిద్దామంటావా?" కోపంగా అరిచాను.

"శ్యాం! ఇక్కడో హోమియో డాక్టరున్నాడు. నేను రెండు మూడుసార్లు ఆయన దగ&గర తీసుకున్నాను. ఆయనతో మందిపిద్దాం!"

"నీమొహం... అల్లోపతిలో తగ్గంది. పంచదార మాత్రిలిచ్చే హోమియోలో తగ్గుతుందా?"

"ఏ పుట్టలో ఏ పాముందో!"

నేను అభ్యంతరం పెట్టలేదు. ఊరికే చూస్తూ కూర్చొనేకంటే ఏదో చేసామన్న తృప్తి

ఉంటే చాలనిపించింది.

నరశింహయ్యగారు దొరికారు. ఆయన హాస్పిటల్‌కు వచ్చి చూశారు. మేము శాంతకుమార్‌గార్ని మ్యానేజ్ చేసుకున్నాం కాబట్టి తన వైద్యం చేశారు.

కొన్ని పొట్లాలిచ్చి ఎలా వాడాలో చెప్పారు. వెళ్ళే ముందు గోపీ నాలుకపైన ఏవో కొన్ని పిల్స్ వేసి వెళ్ళారు.

వెళ్తూ వెళ్తూ ఆయన అన్న మాటలు నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

"గోపీ సాయంత్రానికి బాగా కోలుకుంటాడు. అప్పుడే సింప్టంస్ ఉన్నవి నాకొచ్చి చెప్పండి."

నాకైతే హోమియో మీద నమ్మకం లేదు.

కానీ, ఆ సాయంత్రం గోపీ మాలోకంలో పడే సరికి నాకు మతిపోయింది. దేవుడే ఆయన రూపంలో వచ్చి మందిచ్చాడనిపించింది.

రెండురోజుల్లో డిశ్చార్జి చేయించి యింటికి తీసుకొచ్చాం. యింట్లో ఆయన మందులు వాడచ్చుని.

ఓ ఉదయం చూడటానికి వచ్చాడు జగన్నాథం.

"గోపీ! వాడేరా నీ ప్రాణం కాపాడటానికి మూలసాయం చేసింది."

"జగన్నాథం! నీకేం అపకారం చేశాను. మళ్ళీ ఈ నిరుద్యో బ్రతుకు బ్రతకమన్నావా?" బాధగా అన్నాడు గోపీ.

"గోపీ! నీకు ఉద్యోగం చూసే బాధ్యత నాది." నేను చెప్పాను.

"అలా వచ్చే ఉద్యోగాలు నాకిష్టంలేదు. నా ప్రతిభను గుర్తించి నాకు ఉద్యోగం రావాలి. అటువంటి ఉద్యోగమే చేస్తాను." గోపీ అన్నాడు.

"జగన్నాథం! నీ ఎరికలో ఏవైనా ఉన్నాయా?"

"ఉద్యోగం వెతుక్కునే సామర్థ్యం ఉంటే ఈ టాక్సీడ్రైవర్‌గా ఎందుకు ఉంటాను?"

"రేయ్! నీకు సిగ్గుగా లేదు. యింత చదువు చదివి డ్రైవర్ ఉద్యోగం చెయ్యడానికి?" గోపీ ప్రశ్న!

"ఇంత చదువు చదివి ఆత్మహత్య చేసుకోవడానికి నీకు సిగ్గుగా లేదురా?" జగన్నాథం వాయించాడు.

"జగ్గూ! నాకోసం ఆ ప్రయత్నం చెయ్యలేదురా. నాలాంటి వాళ్ళ దుస్థితి మన ప్రభుత్వానికి తెలియాలని ఆ ప్రయత్నం చేశా! ఉద్యోగం రాని డిగ్రీలు యివ్వద్దని అర్థించా! పని చేసే హక్కును ప్రభుత్వం గుర్తించాలి. అందరికీ ఉద్యోగం యివ్వాలి. ఉద్యోగం లేని వాళ్ళకి కనీసం - ఉపకారవేతనం యివ్వాలి." ఆవేశంగా అన్నాడు గోపీ.

"పద్ధతి అదికాదు. ప్రభుత్వం నీగోడు పట్టించుకోవాలంటే నువ్వు కానీ, నీలాంటివాళ్ళు కొన్ని వందలమంది - ఆత్మహత్య చేసుకున్నా ఉపయోగం లేదు. చాతనైతే ఓ ఉద్యమం నడుపు. నలుగుర్ని చేరదీసి. ఓ సంస్థగా ఏర్పడి ప్రభుత్వంతో చర్చలు జరుపు. నాయకుల్ని కూడగట్టుకుని నీ పాయింట్ చెప్పు" జగన్నాథం అన్నాడు దీర్ఘంగా ఆలోచిస్తూ.

"శ్యాం! జగన్నాథం ఏవో కలలు కంటున్నాడు! ఈ దేశంలో బీదవాడు ఏం సాధించగలడు?"

"ఉందిగా..... ఓటు..... వెయ్యి వేటు!" అన్నాను.

"ఆ వేద్దామనే అనుకున్నా... కానీ, నే వెళ్ళేసరికే నాకా[శ్రమ తప్పించేసి నా ఓటు కాస్త ఎవరో వేసి పుణ్యం కట్టుకున్నారు."

ఇంతలో పోలీసు జీపు ఆగింది యింటి ముందు.

"గోపీ ఎవరు?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు వస్తూ.

"నేనే! ఏం?"

"మిమ్మల్ని అరెస్టు చేస్తున్నా!"

"ఎందుకు? నేనేం దొంగతనం చెయ్యలేదు."

"ఆత్మహత్య చేసుకోవాలని చూశావు. అది నేరం!"

"బాప్‌రే! నా ప్రాణం మీద నాకు హక్కులేదా!" ఆశ్చర్యపోయాడు గోపీనాథ్.

"సార్! ఈ ఒక్కసారికి వదిలెయ్యండి. మీరుణం ఉంచుకోం!" నేను చేతులు నులుముకుంటూ చెప్పాను.

"సారీ! మాకు పైనుండి ఆర్డర్లు వచ్చాయి." ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"వీడు సాధారణ నిరుద్యోగి. పైవాళ్లకేం యింట్రస్టు!" జగన్నాథం కూపీ లాగాడు.

"ఈయన్నే అడగండి." ఇన్‌స్పెక్టర్ చికాగ్గా అన్నాడు.

గోపీ తలవంచుకుని చెప్పాడు.

"నేను ఆత్మహత్య చేసుకోబోతూ... ప్రభుత్వానికి... ఐమీన్ - మినిష్టర్లకి కాపీలు పెట్టాను. నా చావుకు మీరే కారణం - నాలాంటి నిరుద్యోగులు చస్తే - అది హత్య అయినా ఆత్మహత్య అయినా - మాములు చావైనా - దానికి కారణం మీ అసమర్థపు ప్రభుత్వమే అని హెచ్చరించాను."

"అరే! దాంలో తప్పేముంది?" అన్నాను.

"సారీ! చట్టం మీకు వివరించి చెప్పాలంటే నాకు వీలుకాదు. పైనుండి యితన్ని అరెస్టు చెయ్యమని ఆర్డరు - " ఇన్‌స్పెక్టర్ బేడీలు వేస్తూ చెప్పాడు.

రామయ్య - సీతమ్మ ఏడుస్తూ వచ్చి ఇన్‌స్పెక్టర్ కాళ్ళ మీద పడ్డారు.

అతను జాలిగా వాళ్ళ వంక చూశాడు.

నిస్సహాయమైన చూపు.

మేము చూస్తుండగానే అతన్ని జీపు ఎక్కించి తీసుకుపోయారు.

కొన్ని గంటలు గోపీ తల్లిదండ్రుల్ని ఓదారుస్తూ కూర్చున్నాను.

"వాడి చదువుకోసం ఉన్న కాస్త పొలం అమ్మకుండా ఉంటే సమయానికి అదన్నా ఆదుకునేది." రామయ్య బాధ.

"అసలు వాడ్ని బడికి పంపించకుండా ఏ కూలి నాలికో పంపిస్తే - ఇప్పుడు యిలా తయారయ్యేవాడుకాదు." సీతమ్మ ఆవేదన.

నేను ఆలోచిస్తూ వుండిపోయాను. మన వ్యవస్థలో ఎక్కడలోపం ఉంది? ఎందుకు యింతమంది విద్యావంతులు ఉద్యోగాలు లేకుండా ఉండిపోయారు? విదేశాల్లో ఉద్యోగాలు చేయడానికి మనుషులు దొరక్క.... కంప్యూటర్లను, రోబోలను తయారుచేస్తున్నారు ప్రత్యామ్నయంగా. స్వాతంత్ర్యం వచ్చి నాలుగు పదులు దాటినా - ఎన్ని ప్రభుత్వాలు మారినా నిరుద్యోగం మటుకు నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉందికాని, తిరోగమించడంలేదు. బహుశ: ఈ సమస్యకు పరిష్కారం ప్రజల్నుంచే రావాలేమో!

సాయంత్రం ఇంటిముందు రిక్షా ఆగింది.

రిక్షాలోంచి ఓ చక్కటి చుక్క... గోపీ... దిగారు.

ఆమె అతన్ని చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకొచ్చింది.

అందరం ఆశ్చర్యంతో నోరు తెరుచుకొని చూస్తున్నాం - "నా పేరు సింధు! మీ గోపిని మీకప్పగిస్తున్నాను - జాగ్రత్తగా చూసుకోండి! ప్రస్తుతం బెయిలు మీద విడుదల చేయించాను - నాదీపూచీ!"

గోపీ తలొంచుకుని నేలకేసి చూస్తున్నాడు.

ఆమెకు, ఆనంద బాష్పాలతో రామయ్య, సీతమ్మలు, దండం పెట్టారు.

"సింధుగారు - చాలా సంతోషం - కానీ, వీడు మీకెలా తెల్సు?" నోరు పెగల్చుకుని అనుమానం బయటపెట్టాను.

"అన్నయ్య జగన్నాథం చెప్పాడు - అన్నట్టు మీరు శ్యాం?"

"థ్యాంక్యూ! సో - మీరు మా సర్కిల్‌కే చెందినవాళ్ళన్న మాట! నైస్ మీటింగ్!"

"కానీ, ఇంకోసారి - గోపీ యిలా చెయ్యకుండా చూడండి. బై!" ఆమె పోబోయింది.

"సింధూ! ప్లీజ్ నన్ను జైలుకు పంపించు. మళ్ళీ నేను ఆత్మహత్య చేసుకుంటే నీకు

మాటవస్తుంది." గోపీ అన్నాడు సింధూను ప్రార్థిస్తూ.

సింధూ ఆగింది. తన విశాలమైన నేత్రాల్ని పెద్దవి చేసి చూసింది.

"గోపీ! ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నావ్?"

"ఉద్యోగం లేని బతుకు బతకలేను. నన్ను గుర్తించి నాకు ఉద్యోగం ఇవ్వాలి. అంతేగాని ఎవరి సిఫార్సులపైన నాకు ఉద్యోగం వద్దు." గోపీ చెబుతూంటే నాకు కోపం వచ్చింది. మూర్ఖుడు!

సింధు సీరియస్‌గా అతడి కళ్ళలోకి చూసి అంతకంటే సీరియస్‌గా అడిగింది - "ఒకే! అయితే నేయిస్తాను - చేస్తారా?"

"వ్వాట్! మీరా!?" అందరం ఆశ్చర్యపోయాం.

"మంచి ఉద్యోగమైతే నాకభ్యంతరం లేదు." గోపీ అన్నాడు.

"యస్- దెన్ - యు ఆర్ అపాయింటెడ్! రేపటినుండి - అఫ్‌కోర్స్ - మీకిష్టమైతే ఈ రోజునుండే ఉద్యోగంలో చేరవచ్చు."

"ఏం ఉద్యోగం, సింధూ?" సంభ్రమంతో గోపీ ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"హబ్ - నా హజ్‌బెండ్ పోస్ట్-" అతని చెయ్యి తొలగిస్తూ సిగ్గుతో తలవాల్చుకుంటూ చెప్పింది సింధు.

అందరం నోటమాటరాక బొమ్మల్లా చూస్తూ వుండిపోయాం.

"ఏం మాట్లాడరేం? తప్పేముంది నే అన్నదాంలో! నాకు మంచి ఉద్యోగం ఉంది. నిరుద్యోగులకు నిలయమైన మన భారతంలో భార్యాభర్తల్లో ఒకరికి ఉద్యోగం ఉంటే చాలదా? వాళ్ళ జీవితాలు సుఖంగా గడిచిపోవడానికి? చాలు! గోపీని నేనిష్టపడుతున్నాఉ." ఆవేశంగా అంది సింధు." వేలకువేలు కట్నం పోసి మొగుడ్ని కొనుక్కోలేను. నన్ను యిష్టపడి నన్ను నన్నుగా స్వీకరిస్తానంటే నాకీ పెళ్ళి యిష్టమే!"

చెమర్చిన కళ్ళతో సింధు చెప్పింది.

"సింధూ! నేను వెంటనే ఉద్యోగానికి జాయినింగ్ రిపోర్టు యిస్తున్నాను." అంటూ ఆమె చెయ్యి అందుకున్నాడు గోపీనాథ్.